క్లుప్తంగా

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

గిద్దలూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పిడతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణలో 'భారత రాజ్యాంగం ప్రాముఖ్యత' అనే అంశం పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు పిడత రమేష్‌రెడ్డి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు కొండారెడ్డి, స్వరూపారెడ్డి, రామిరెడ్డి, ప్రకాశం జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి దూదేకుల బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల స్పందన స్కూల్ పనిచేసే ముగ్గురు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు వచ్చినట్లుగా ఆ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్కూల్‌లో పనిచేస్తున్న డి.ద్రావిడ్, దూదేకుల ఖాదర్‌బి, ఎ.లక్ష్మి అనే ఉపాధ్యాయులు ఒంగోలులోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఉత్తమ అవార్డులను తీసుకున్నట్లుగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో గిద్దలూరు వినూత్న మేనేజింగ్ డైరెక్టర్ అచ్చుకట్ల ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా రాజ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



రాజ్‌కుమార్

తర్లుపాడు: ఎస్సైగా రాజ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై సుధాకర్ కొత్తపట్నం ఎస్సైగా బదిలీపై వెళ్లారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు



పోటీలను ప్రారంభిస్తున్న బాల వెంకటేశ్వర్లు

పొదిలి: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ముందుగా కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆటల పోటీలను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.బాల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కబడ్డీ, క్రికెట్, పరుగుపందెం, నాలుగు వందల మీటర్ల నడక, షాట్‌పుట్, బాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు అబ్దుల్‌హై, ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, పి.వెంకటేశ్వర్లు, లింగయ్య, కోటేశ్వరరావు, నాసర్‌మహ్మద్, కామేశ్వరరావు, పాల్గొన్నారు.

వరద బాధితులకు చీరలు, దుప్పట్లు పంపిణీ



బాధితులకు దుప్పట్లు అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

పొదిలి: పొదిలి తాలూకా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ ఓల్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ వాంబే కాలనీ, సింగ్‌నగర్‌లో వరద బాధితులకు చీరలు, దుప్పట్లు, పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. వృద్ధులకు శాలువాలు అందచేశారు. అధ్యక్షుడు రావూరి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాయల్, కార్యవర్గ సభ్యులు గుంటూరు శ్రీనివాసులు, పి.మల్లికార్జునరావు, ఈదుమూడి కృష్ణ, సీహెచ్ శ్రీను, వై.బాలప్రసాదు, బి.వెంకటేశ్వర్లు, రావూరి శ్రీధర్, వి.శ్రీను పాల్గొన్నారు.

అక్షర జ్ఞానంతో సంపూర్ణ వెలుగులు



మాట్లాడుతున్న గోపాలరెడ్డి


పొదిలి: అక్షర జ్ఞానంతో సమాజంలో సంపూర్ణ వెలుగులు ప్రసరితమవుతాయని వయోజన విద్య పూర్వ రాష్ట్ర సంయుక్త సంచాలకుడు తాటిపర్తి గోపాలరెడ్డి అన్నారు. 58వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఆదివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించారు. తొలుత వయోజన విద్య సిబ్బంది, పర్యవేక్షకులు, బాలికలతో ర్యాలీ నిర్వహించారు. అందరికీ విద్య అనే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం గోపాలరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అంతరాలు తొలగిపోవాలంటే అందరూ అక్షరాస్యులు కావాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా ఉపసంచాలకుడు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఏపీఓ సురేఖ, పర్యవేక్షకులు పాల్గొన్నారు.



మార్కాపురం మార్కెట్ సెంటర్‌లో కొలువుతీరిన గణనాథుడు



కొమరోలులో 7 అడుగుల మట్టి విగ్రహానికి పూజలు అందిస్తున్న భక్తులు



బేస్తవారిపేటలో బాలాపూర్ మోడల్ గణనాథుడు



బేస్తవారిపేటలో భారీ వినాయకుడు



గిద్దలూరులో వినాయకుడిని పూజిస్తున్న భక్తులు

ఏకదంతాయ వక్రతుండాయ..



పొదిలి : వైఎస్సార్ రెడ్డి నగర్‌లో



గొట్లగట్టులో గణపతికి పూజలు



పొదిలి బిట్స్ విద్యా సంస్థల్లో పూజలందుకుంటున్న గణనాథుడు

మార్కాపురం: వినాయకచవితి పండుగను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లోని అన్ని గ్రామాలలో, పట్టణాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలల్లో గణనాథుడు కొలువుతీరాడు. పట్టణంలో సుమారు 70 ప్రాంతాల్లో వినాయక మండపాలలో ప్రత్యేకంగా అలకంరించి విఘ్నేరున్ని ప్రతిష్ఠించారు. మెయిన్‌బజార్, వడ్డెబజారు, కాల్వకట్ట, కొండెపల్లి రోడ్డు, పీఎస్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక అలంకరణల్లో విఘ్నేశ్వరుడు కొలువుతీరాడు. భక్తులు పూలు, పత్రితో స్వామిని ప్రత్యేకంగా పూజలు చేశారు.

కొనకనమిట్ల: మండలంలో వినాయకచవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. దండాలయ్యా.. ఉండ్రాలయ్యా అంటూ గణనాథునికి పత్రి, పండ్లు, పూలు, వడపప్పు, పానకం సమర్పించి విశేషపూజలు చేశారు. గ్రామాలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని రైతన్నలు విఘ్నేశ్వరుని వేడుకున్నారు. వినాయక పందిళ్లతో పల్లె ప్రాంతాలు కళకళలాడాయి. గొట్లగట్టులో చిన్నారులు మట్టితో చేసిన గణనాథుడిని వీధుల్లో ఊరేగిస్తూ ఇంటింటికీ తిరిగి పూజలు చేయించారు. గొట్లగట్టులో ఏర్పాటు చేసిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రేక్షకులను అలరించింది.

పొదిలి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వాడవాడలా గణనాథుని విగ్రహాలు పూజలందుకున్నాయి. మండపాలను ప్రత్యేకంగా అలంకరించి విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. విశ్వనాథపురంలోని కాలేజీ రోడ్డు, విరాట్‌నగర్, వైఎస్సార్ రెడ్డినగర్, ఆటో మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో, పోతవరం, కంభాలపాడు, బిట్స్ కళాశాలలో, ఆల్ఫా, గీతాంజలి స్కూలులో, మాదాలవారిపాలెం, బ్యాంకు కాలనీ, కందుకూరు వెంచర్, వీరారెడ్డి వీధి, ప్రకాశ్‌నగర్, విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డు, పాత కోర్టు రోడ్డు, పీఎస్‌ఆర్ కాలనీ, ఓబులశెట్టివారి వీధి, గుద్దేటి బజార్, ఆర్టీసీ బస్‌షెల్టర్, శ్రావణి ఎస్టేట్, కాటూరివారిపాలెం, చిన్న బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం వీధి, అమ్మవారిశాల తదితర ప్రాంతాల్లో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తర్లుపాడు: మండలంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణనాథున్ని ప్రత్యేక అలంకరణలో అలంకరించి పూజలు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన మండపాల్లో నిర్వాహకులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తర్లుపాడులో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు జగన్‌బాబు ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను అందజేశారు.

పొదిలిరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఊరువాడా ప్రత్యేక ఆకృతుల్లో ఉన్న విభిన్న గణపతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాలు ప్రత్యేకంగా అలంకరణ చేసి ఉత్సవ కమిటీ సభ్యులు గణనాథుడ్ని ప్రతిష్ఠించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్కాపురం టౌన్: వినాయకచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కంభం రోడ్డు, సిఫానీ బజారు, ఆంజనేయస్వామి గుడి, నెహ్రూబజారు, రాజాజీ వీధి, మెయిన్ బజారు, అమ్మవారిశాల, తేరుబజారు, తూర్పువీధి, నాయుడు వీధి, సీఎస్‌టీ హాల్ రోడ్డు, నాగులవరం రోడ్డు, కాలేజీ రోడ్డు, జవహర్‌నగర్ కాలనీ, తర్లుపాడు రోడ్డు, పీఎస్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో గణనాథున్ని ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పట్టణం, మండలాల్లోని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి, ఏరువ శివనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మట్టివినాయక విగ్రహాలను పట్టణంలోని పాత బస్టాండులో ఉచితంగా అందచేశారు.



బేస్తవారిపేట రెడ్డినగర్‌లో కోలాట భజనలు

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

బేస్తవారిపేట: మండల ప్రజలు వినాయచవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం వినాయకుడి విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కోలాటం, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. బేస్తవారిపేటలోని నెహ్రూ బజార్‌లో ఏర్పాటు చేసిన బాలాపూర్ మోడల్ వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా హోమాలు, కుంకుమ పూజలు చేశారు. రెడ్డినగర్, నెహ్రూబజార్‌లలో భరతనాట్యం భక్తులను అలరించాయి.

కంభంలో..

కంభం: వినాయకచవితి పండుగను శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పురవీధుల్లో మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండపాల వద్ద కోలాటం, పాటకచేరి, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గిద్దలూరు రూరల్..

వినాయక చవితి సందర్భంగా గిద్దలూరు మండలంలోని ప్రజలు శనివారం ఎంతో భక్తి శ్రద్ధలతో పండుగను నిర్వహించుకున్నారు. పట్టణంలోని గణేష్‌నగర్, నల్లబండబజారు, రాజానగర్, పొట్టిశ్రీరాములు వీధి, పాండురంగారెడ్డినగర్, నరసింహస్వామి మెట్ల రోడ్డు, పాత సత్యనారాయణ థియేటర్ వీధి, పాములపల్లెరోడ్డు, శ్రీరామ్‌నగర్, పి.ఆర్.కాలనీ, వివేకానందకాలని, రాచర్ల రోడ్డు, వెంకటేశ్వరకాలనీలతో పాటు మండలంలోని అన్ని గ్రామాలల్లో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు. వినాయకుడి మండపాల వద్ద భక్తులకు తీర్థప్రసాదాలతో పాటుగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. వినాయకుడి మండపాల వద్ద పెద్ద పెద్ద లడ్డు ప్రసాదాలను స్వామి వారి వద్ద ఉంచి సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని ముండ్లపాడు గ్రామంలో వినాయకుడి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

కొమరోలు: మండలంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా గ్రామగ్రామాన అంగరంగ వైభవంగా వేడుకలను నిర్వహించారు. శనివారం గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసి కమిటీ సభ్యులు వినాయక విగ్రహాలను పెట్టి పూజలు చేశారు. కొమరోలు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలసిన ప్రధాన వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెక్‌పోస్టు వద్ద 7 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు అందించారు. 2వ రోజు ఆదివారం కూడా వినాయక మండపాల్లో వినాయక ఉత్సవాలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఆముదాలపల్లిలో వినాయక వేడుకల్లో పాల్గొన్న భక్తులు



మార్కాపురంలో మట్టి వినాయక ప్రతిమలను అందిస్తున్న గుంటక సుబ్బారెడ్డి, నాయకులు



భరతనాట్యం చేస్తున్న భవిష్య



కంభంలో గణేష్ నిమజ్జన గ్రామోత్సవం

కోలాహలంగా నిమజ్జనం

కంభం: గణేష్ నిమజ్జన వేడుకలు కంభంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కంభం పట్టణంతో పాటు బేస్తవారిపేట, అర్థవీడు మండలాల్లోని పలు గ్రామాల్లో విగ్రహాలను కంభం చెరువులో నిమజ్జనం చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు మండపాల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించారు. చీకటి పడినా ఇబ్బందులు లేకుండా కంభం చెరువు వద్ద లైటింగ్ ఏర్పాటు చేసి కట్టపైకి వచ్చిన విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. భక్తులు వినాయకుడి వద్ద పూజలు నిర్వహించి పత్రి, ఇతర పూజ సామగ్రిని, వినాయకుడి ప్రతిమలను చెరువులో వదిలారు. అధిక సంఖ్యలో ప్రజలు కట్టపైకి తరలి రావడంతో కట్టపై కోలాహలం నెలకొంది. గ్రామోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శి డీఎస్పీ నరసింహులు ఆధ్వర్యంలో కంభం ఇన్చార్జ్ సీఐ రామకోటయ్య, ఎస్సై బి.నరసింహారావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే కేపీ ప్రత్యేక పూజలు

మార్కాపురం రూరల్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి మండలంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. కొండెపల్లి ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి, పార్టీ నాయకులు మందటి రామమోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. బోడపాడులో వినాయకచవితి పండుగ సందర్భంగా భవిష్య చేసిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ



కంభం చెరువు మెట్ల వద్ద కోలాహలం



కంభంలో చెరువులో నిమజ్జనం చేస్తున్న భక్తులు



కంభంలో వినాయక మండపం వద్ద భక్తుల కోలాటం

వర్గీకరణ ఫలితాలు అందరికీ చేరాలి



ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

పొదిలి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ద్వారా సుదీర్ఘంగా పోరాటాల ద్వారా సాధించుకున్న వర్గీకరణ ఫలితాలు మాదిగ జాతికి అందరికీ చేరాలని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ కోరారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిక్షాలు మాట్లాడుతూ వర్గీకరణకు దారి తీసిన పోరాటాలు, అందరికీ చేరాలంటే చేయాల్సిన పనుల గురించి గ్రామాల్లో అందరికీ తెలిసేలా మాదిగ ఉద్యోగులు అవగాహన కల్పించాలన్నారు. అందరూ ఐక్యంగా కష్టపడటం, పోరాటాలు చేయడం ద్వారానే వర్గీకరణ సాధ్యమైందని మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాసు మాదిగ అన్నారు. మాదిగలకు సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. ఎంఈఎఫ్ కోశాధికారి జాలయ్య, ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ దుడ్డు జయ, తాళ్లూరి శేషయ్య, పొదిలి ఎంఈఎఫ్ యూనిట్ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వివేకానంద కళాశాలకు చెందిన 1983–88 సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థులు గెట్ టు గెదర్ సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాములూరు శ్రీనివాసరెడ్డి, గురువులు పి.నారాయణరెడ్డి కుమారుడు పిడతల సురేష్‌రెడ్డి, టి.వెంకటరెడ్డిల సహకారంతో పి.ఆర్.కాలనీ సమీపంలోని సంజీవని అనాథ ఆశ్రమానికి, కొంగలవీడురోడ్డులోని అమ్మ ఆశ్రమం, రాచర్ల రోడ్డులోని మానసిక వికలాంగుల పాఠశాలలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఆశ్రమం పరిసరాల్లో మొక్కలు నాటారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో గర్భిణులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తులసిబాబు, కె.పి.కాశయ్య, అలసందలపల్లె శ్రీనివాసులు, సీహెచ్.ప్రభాకర్, పోలయ్య, పిచ్చిరెడ్డి, గురవయ్య, జయరాంపురానికి చెందిన కాశయ్య, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

మార్కాపురం: పట్టణ శివారులోని ఎస్టేట్ వద్ద ద్విచక్రవాహనం ఢీకొన్నఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై సైదుబాబు తెలిపిన వివరాల ప్రకారం..ఎస్టేట్‌లో నివాసం ఉండే మొఘల్ రిజ్వాన్ అలీబేగ్ తన తన నివాసం సమీపంలో చికెన్‌షాపుముందు నిలబడి ఉండగా గొట్టిపడియ గ్రామానికి చెందిన నవయ్య తన మిత్రులతో కలిసి బైక్‌పై వెళ్తూ పక్కనే ఆగి ఉన్న అలీబేగ్‌ను ఢీకొట్టడంతో అలీబేగ్‌కు, నవయ్యకు కూడ తీవ్ర గాయాలయ్యాయి.ఇద్దరిని చికిత్స నిమిత్తంఒంగోలు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ద్విచక్ర వాహనం ఢీకొట్టి మహిళకు తీవ్రగాయాలు

కంభం: ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొని ఓ మహిళకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం కందులాపురం రోడ్డులో జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన గోపిశెట్టి భవాని శనివారం వినాయక చవితి పండుగకు తన భర్తతో కలసి రాచర్ల మండలం నుంచి సొంతూరుకు వచ్చింది. శనివారం పండుగ చేసుకొని, ఆదివారం గ్రామోత్సవం కార్యక్రమం చూసుకొని తిరిగి భర్తతో కలసి ద్విచక్రవాహనం పై వెళ్తుండగా కందులాపురం రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు మద్యం మత్తులో ఢీకొట్టడంతో భవాని చెయ్యి విరగడంతో పాటు నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. భర్తకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు.

100 మందికి వైద్య పరీక్షలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని నాగులవరం రోడ్డులోని మీనామసీదు ఎదురుగా ఉన్న డాక్టర్ తాజ్ ఆయుర్వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ తాజ్‌ఉద్దిన్ ఉల్‌హాక్ తెలిపారు. మోకాల నొప్పులు, కీళ్లు, నడుము నొప్పులు, మెడ నొప్పికి, సోరియాసిస్, వెన్నుముక సమస్యలకు చికిత్స అందించినట్లు తెలిపారు.



శిబిరంలో పరీక్షిస్తున్న డాక్టర్ తాజ్‌ఉద్దీన్